క్లుప్తంగా

పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

ఇల్లెందురూరల్: వర్షాలు కురవకముందే పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులను, ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మురుగుకాల్వల్లో షిల్ట్ పేరుకుపోకుండా వేసవిలోనే శుభ్రం చేయించాలని చెప్పారు. వీధుల్లో చెత్త నిల్వ ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయించాలని సూచించారు. రహదారుల వెంట ఏపుగా పెరుగుతున్న మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం నర్సరీని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సుమారు 35 సంవత్సరాలు వివిధ హోదాలో పనిచేసి కార్పొరేట్ సివిల్ జీఎంగా ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సీహెచ్ రమేష్‌బాబును, కొత్తగూడెం ఏరియాలో ఏజీఎంగా విధులు నిర్వహిస్తూ జీఎం సివిల్‌గా వెళ్తున్న టి.సూర్యనారాయణను శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జ్ జీఎం సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం శ్రీరమేష్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: గుండ్లరేవు గ్రామానికి చెందిన తాటి స్వప్న అనే మహిళ 11 నెలల క్రితం బాలింత జబ్బుతో మృతి చెందింది. స్వప్న కుటుంబాన్ని పరామర్శించిన జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు స్వప్న కుమారుడి పేరు మీద వెంకటరెడ్డి స్థానిక ఎస్‌బీఐలో శుక్రవారం రూ.20 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందజేశారు. బానోత్ విజయాబాయి, మధుసూదన్‌రావు, నాగరాజు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, పోతురాజు నాగరాజు, కాలం వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, స్వప్న కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు పరిశీలన

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్ద తండా, కాల్వ తండాలో కిన్నెరసాని తాగునీటి పైపులైన్ లీకై నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పనులను పరిశీలించారు. మాట్లాడుతూ.. కేటీపీఎస్ కెనాల్ నుంచి నీటి కాలువ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరుగుతోందని, ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా మరమ్మతు పనులను చేయించడం జరుగుతోందన్నారు. ఏఈ రాము, టీపీఎస్ ప్రభాకర్, వార్డు కౌన్సిలర్లు ధర్మరాజు, పరమేష్ యాదవ్, అంబుల వేణుగోపాల్, మాదా శ్రీరాములు పాల్గొన్నారు.

డ్యాన్స్ కోచింగ్ సెంటర్ ప్రారంభం

ఇల్లెందు: పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని బ్లూమూన్ డ్యాన్స్ స్టూడియోలో శుక్రవారం సమ్మర్ క్యాంప్ డ్యాన్స్ కోచింగ్‌ను సీఐ టి.కరుణాకర్ ప్రారంభించారు. మాట్లాడుతూ... వేసవి సెలవుల్లో డ్యాన్స్ కోచింగ్ నిర్వహిస్తూ ఎంతోమందిని కొరియోగ్రాఫర్లుగా తీర్చిదిద్దిన పాదిలి శ్యామ్ డ్యాన్స్ స్టూడియోలో కోచింగ్ పొందినవారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముద్రగడ వంశీ, డ్యాన్స్ మాస్టర్లు పాదిలి శ్యామ్, అరుణ్, పవన్ కల్యాణ్, శశి తదితరులు పాల్గొన్నారు.

అందని ఆయుష్ వైద్య సేవలు

- రోజు విడిచి రోజు తెరిచే ఆస్పత్రి
- కానీ అందని వైద్యం
- పట్టించుకోని అధికారులు



జూలూరుపాడు పీహెచ్‌సీలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

జూలూరుపాడు: జూలూరుపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లోని ఆయుష్ ఆస్పత్రిలో వైద్య సేవలు నిలిచిపోయాయి. 12 ఏళ్ల క్రితం జూలూరుపాడు సీహెచ్‌సీలో ప్రభుత్వ ఉచిత ఆయుర్వేద వైద్యశాల (ఆయుష్ డిస్పెన్సరీ కేంద్రం) ఏర్పాటు చేశారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయుష్ ఆస్పత్రి ఉందనే విషయం మండల ప్రజలకు తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. ఇందుకు కారణం నాటి నుంచి నేటి వరకు వైద్యసేవలు ప్రారంభించకపోవడమే. ఆయుష్ డిస్పెన్సరీ కేంద్రంలో ఎలాంటి సేవలు లేకపోవడంతో ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక కేంద్రం (పీహెచ్‌సీ) భవనంలోని ఒక గదిలో ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో ఒక డాక్టర్, ఫార్మసిస్ట్, ఎస్‌ఎన్‌ఓలు విధులు నిర్వహించాల్సి ఉంది. ఆరేళ్లుగా ఆయుర్వేద డాక్టర్ (మెడికల్ ఆఫీసర్) పోస్ట్ ఖాళీగా ఉండగా, ఫార్మసిస్ట్‌పై ఆరోపణలు రావడంతో రెండున్నరేళ్ల క్రితం టెర్మినేషన్ గురి కాగా కాంట్రాక్ట్ విధానం ద్వారా ఎంపికైన ఎస్‌ఎన్‌ఓ (స్వీపర్) ఉద్యోగి మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎస్‌ఎన్‌ఓ మాత్రమే విధులకు హాజరవుతూ ఆస్పత్రి తలుపు తీసి కూర్చోవడం తప్ప ఎలాంటి వైద్య సేవలు అందించే పరిస్థితి లేదు. దీంతో ఐపీ, ఓపీ సేవలు నిలిచిపోవడంతో ఆయుష్ ఆస్పత్రి అలంకారప్రాయంగా ఉంది. దీంతోపాటు దుమ్ము, ధూళి, బూజు పట్టి ఉంది. మెడికల్ ఆఫీసర్ పోస్టు ఐదేళ్లుగా భర్తీ చేయకపోవడంతో ఖాళీ కుర్చీ దర్శనమిస్తోంది. పీహెచ్‌సీని సందర్శించడానికి జిల్లా ఉన్నత వైద్యాధికారులు వస్తూపోతూ ఉంటారు కానీ, ఆయుష్ ఆస్పత్రి ఉందనే విషయం వారికి తెలియకపోవచ్చు. ఆస్పత్రిలో రూ.లక్షల విలువ గల మందులు, లేహ్యాలు, పొడులు ఉన్నా వాటిని రోగులకు ఇచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే గడువు తీరి ఉన్నాయి. రోగులు వస్తే పరీక్షలు నిర్వహించే డాక్టర్ గానీ మందులు ఇచ్చే ఫార్మసిస్ట్ లేకపోవడంతో దిక్కూమొక్కూ లేక ఆయుష్ ఆస్పత్రి నిరుపయోగంగా ఉంది. దీంతో మండల ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఆయుష్ ఆస్పత్రిలో ఖాళీగా పోస్టులను భర్తీ చేసి స్థానికులకు వైద్యసేవలు అందించాలని కోరుతున్నారు.



డాక్టర్ లేకపోవడంతో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీ

ఆస్పత్రి ఉందనే విషయం తెలియదు



స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆయుర్వేద ఆస్పత్రి ఉందనే విషయం ఇప్పటివరకు తెలియదు. ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి వైద్యసేవలు అందుబాటులోకి రాలేదు. ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యసిబ్బందిని ప్రభుత్వం నియమించి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలి.

– ఇల్లంగి గోపయ్య, జూలూరుపాడు

నిరుపయోగంగా ఆస్పత్రి



ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో ఆయుర్వేద ఆస్పత్రి నిరుపయోగంగా ఉంది. ఆస్పత్రిలో డాక్టర్, వైద్యసిబ్బందిని నియమించి పేద ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆయుర్వేద వైద్యాన్ని అందుబాటులోకి తేవాలి.

– లకావత్ సూర్య, మాచినేనిపేటతండా

ఖాళీలు భర్తీ చేయాలి



ఆయుర్వేద ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్, ఫార్మసిస్ట్, వైద్యసిబ్బందిని భర్తీ చేయాలి. ఏళ్ల తరబడి డాక్టర్ లేకపోవడంతో వైద్య సేవలు అందడం లేదు. ఆస్పత్రి తీసి ఉంటుంది కానీ ఎవరూ ఉండరు. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించి వైద్యసేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– బానోత్ మోహిలాల్, సురారం

‘ఉపాధి’ స్వస్తికి కుట్ర జరుగుతోంది



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావుల అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర నాయకులు కందగట్ల సురేందర్, కొక్కు సారంగపాణి, గౌని నాగేశ్వరరావు మాట్లాడారు. 2005లో ప్రారంభమైన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిలో భాగంగానే 2023 కేంద్ర బడ్జెట్ అని విమర్శించారు. దేశవ్యాపితంగా 50 కోట్ల మందికి జాబ్‌కార్డులు ఉన్నప్పటికీ 13 కోట్ల మందికి కూడా పని కల్పించడం లేదని విమర్శించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని, ఎంజీఎంఆర్, ఈజీఎస్‌లను రూపుమాపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదని ధ్వజమెత్తారు. ఉపాధి కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.750 ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి సంవత్సరానికి రెండువందల రోజుల పని కల్పించాలని, ఏపీఓ నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ల వరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈపీఎఫ్, పీఆర్‌సీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.21 కోట్ల వేతనాలు చెల్లించాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే ఆకుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుంజా కృష్ణ, మోతుక్కూరి మల్లికార్జున్, పెద్దపోలు చలపతిరావు, సూర్నపాక నాగేశ్వరరావు, గుగులోత్ రాంచందర్, ఎట్టి నరసింహారావు, పూనెం రంగన్న, సామేలు, సర్పంచ్ అజ్మీరా శంకర్, గడ్డం లాలయ్య, వెంకన్న, రియాజ్, పద్దం వెంకన్న, కారం కుమారి, వినోద, వర్స లక్ష్మి పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం




మాట్లాడుతున్న పోట్ల నాగేశ్వరరావు

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అన్నారు. కారెగట్టు గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుబడిందన్నారు. సరైన రహదారులు లేవు, తాగునీరు ఇవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి చెందుతుందని చెప్పిన కేసీఆర్ తొమ్మిదేళ్ల అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కల్పిస్తామని, నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో గద్దల రమేష్, బాలశౌరి, అల్లడి నర్సింహారావు, గౌస్‌పాషా, కోటేశ్వరరావు, కాపా శ్రీను, హెచ్.మధు, గిరిప్రసాద్, పనీశ్వర్, ఉస్మాన్, వెంకట్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేసి వీఓఏల నిరసన



ఇల్లెందురూరల్: దీక్షలో కూర్చున్న వీఓఏలు



పాల్వంచరూరల్: ఐకేపీ ఏపీఎం రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

జూలూరుపాడు: వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 12వ రోజు శుక్రవారం జూలూరుపాడులో వీఓఏలు భిక్షాటన చేశారు. మండల కేంద్రంలోని బ్యాంకులు, దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు కడియాల ఉమ మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు బాపట్ల సత్యావతి, మోదుగు బాలకోటేశ్వరి, మీనా కుమారి, కృష్ణవేణి, సున్నా లక్ష్మి, అశోక్, బేగం, త్రివేణి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం 12వ రోజుకు చేరింది. సీసీ నాగేశ్వరరావు వీఓఏల సమ్మెకు మద్దతు పలికి సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి మూడ్ చరణ్, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, శిరోమణి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: సెర్ప్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు మెరుగైన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో అమలు చేసే ప్రభుత్వ పథకాలన్నీ ప్రతి ఇంటికి చేరవేసి ముఖ్యపాత్ర పోషిస్తున్న వీఓఏలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నబి, తాళ్లూరి కృష్ణ, సుల్తానా, మరియా, మోహన్‌రావు, ఆలేటి కిరణ్, నవ్య, ప్రమీల, పాపారావు, మోతీలాల్, వసంతరావు, నీలాబాయి, సురేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు చేపట్టిన నిరాహార దీక్ష కొనసాగుతోంది. శుక్రవారం వీఓఏలు ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, గ్రేడింగ్ పద్ధతి రద్దు చేయాలని, సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐకేపీ ఏపీఎం రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.సత్య, దొడ్డ రవికుమార్, రమేష్, రమాదేవి, ఉమ, కృష్ణవేణి, సుజాత, జయ, కల్పన, మహేశ్వరి, రోజా, కుమారి పాల్గొన్నారు.

నేడు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

టేకులపల్లి: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం టేకులపల్లి మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు టేకులపల్లిలో ప్రారంభమై శాంతినగర్, చుక్కాలబోడు, కుంటల్ల, రామచంద్రునిపేట, మురుట్ల, పాతర్లగడ్డ, బండవారి గుంపు, బోడు, బోడుకొత్తగూడెం, కొప్పురాయి, ఒడ్డుగూడెం, బర్లగూడెం, జంగాలపల్లిలో సాయంత్రం 6 గంటలకు పర్యటన ముగుస్తుందని తెలిపారు. ఈ గ్రామాల్లో పలు కుటుంబాలను ఆయన పరామర్శిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

‘కంటివెలుగు’ ప్రారంభం

టేకులపల్లి: బర్లగూడెం గ్రామంలో శుక్రవారం ఉచిత కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ పూనెం రాంబాబు ప్రారంభించారు. డాక్టర్ రూపాచంద్, కార్యదర్శి జబ్బార్, సూపర్‌వైజర్ పోరండ్ల వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి జనరేటర్ సౌకర్యం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఎట్టకేలకు జనరేటర్‌ను సమకూర్చారు. సుమారు రూ.5 లక్షలు వెచ్చించి జనరేటర్‌ను కొనుగోలు చేశారు. ఇటీవల రోగులకు విద్యుత్ అంతరాయం- డయాలసిస్ సేవలకు జనరేటర్ అవసరాన్న సాక్షి దినపత్రిక పలు దఫాలుగా అధికారుల దృష్టికి తెచ్చింది. స్పందించిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.రవిబాబు ఎట్టకేలకు జనరేటర్ సమకూర్చారు. రెండురోజుల్లో డయాలసిస్ సెంటర్‌కు అన్ని వసతులు కల్పించి రోగులకు వైద్యం అందిస్తామని డాక్టర్ రవిబాబు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

విద్యుత్ స్తంభం తొలగింపు

టేకులపల్లి: టేకులపల్లి పంచాయతీలోని సమ్మక్క సారక్క గద్దెల వద్ద ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ స్తంభం విరిగి ఒకవైపుకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై గురువారం ‘సాక్షి’లో అటెన్షన్ ప్లీజ్ శీర్షికలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ ఆదేశాల మేరకు లైన్‌మెన్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు విద్యుత్ అధికారులకు, సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం

పాల్వంచ: కానిస్టేబుల్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జీఎస్సార్ ట్రస్ట్, పాల్వంచ యువసేన పిట్టల సంపత్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో అభ్యర్థులకు పెన్నులు పంపిణీ చేసి, ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీఎస్సార్ ట్రస్ట్ సేవలు సామాన్యులకు అందేలా కృషి చేస్తామన్నారు. అభ్యర్థులు ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారులను సన్మానిస్తున్న కొత్వాల తదితరులు

పాల్వంచ: సమాజంలో ప్రతిఒక్కరూ కళలు, కళాకారులను ప్రోత్సహించాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివారావు అన్నారు. ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సందర్భంగా శుక్రవారం కోలాట నృత్యకారిణి బేర శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక కేఎస్‌పీ రోడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్వాల మాట్లాడారు. కళాకారులకు చిన్నతనం నుంచే శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయికి ఎదిగేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కళాకారుల వేదిక కోసం ఆడిటోరియం నిర్మాణాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం బేర శ్రీలక్ష్మిని, కళాకారులకు మెమెంటోలు బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, ఆత్మలింగేశ్వరాలయం ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్, చారి, ప్రశాంత్, యర్రంశెట్టి మధుసూదన్ రావు, శ్రీను, చిరంజీవి, విజయ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: తల్లితండ్రులను కోల్పోయిన అనాథ బాలికల కోసం హైదరాబాద్‌లోని దుర్గాభాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా ఈ విద్యా సంవత్సరానికిగాను ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో సివిల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ విభాగాలలో ప్రతి కోర్సుకు 60 సీట్ల చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నాయని, అందులో 70 శాతం తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద అనాథ బాలికలకు, దివ్యాంగులకు 3 శాతం సీట్లను కేటాయించారని వివరించారు. దరఖాస్తుకు కలెక్టరేట్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్మిక చట్టాలను రక్షించుకుందాం..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: చికాగో అమరుల స్ఫూర్తితో కార్మిక చట్టాలను పరిరక్షించుకుందామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో మేడే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేసి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారన్నారు. మే 1న పాల్వంచలో పలుచోట్ల నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరావు ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, నరహరి నాగేశ్వర్వరరావు, శనగారపు శ్రీనివాస్, గూడెపూరి రాజు, మంజునాథ్, కాంతయ్య, వెంకన్న, జకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోడేటి నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. శుక్రవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, మోతుక్కూరి మల్లికార్జున్‌రావు, సామేల్, వైఎస్‌రెడ్డి, నరసింహారావు, వినోద్, చలపతి రావు, మల్లేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి గేటు మూసివేత సరికాదు..



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని జిల్లా ప్రధానాస్పత్రి ప్రధాన ముఖద్వారాన్ని మూసివేయడం సరైంది కాదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య అన్నారు. శుక్రవారం గాజులరాజం బస్తీ సమీపంలోని జిల్లా ప్రధానాస్పత్రి ఎదుట జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలాకాలంగా ఆస్పత్రికి సంబంధించిన ప్రధాన ముఖద్వారం ఉందని ప్రస్తుతం దీనిని మూసివేయడం అన్యాయమని, దీనివల్ల రోగులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ముఖద్వారాన్ని తొలగించి చేపట్టిన గోడను తొలగించి తిరిగి ప్రధాన గేట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.వలీబాబా, అల్లి భాస్కర్, కూచన కృష్ణారావు, కాకెల్లి సైమన్, తమ్మిశెట్టి రామారావు, ఎండీ మౌలానా, డి.రామ్మూర్తి, గడ్డం రాజయ్య, సఫ్దార్‌బేగ్, ఎండీ అలీముద్దీన్, గుర్రం సంగీతరావు, దూళిపాల మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు..

తాగునీరు అందించడంలో విఫలం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో ప్రజలకు తాగునీరు అందించడంలో పాలకులు విఫలమయ్యారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. గురువారం పార్టీ శ్రేణులతో గాజులరాజం బస్తీ 35వ వార్డులో ప్రజలకు తాగునీరు అందించాలనే డిమాండ్‌తో ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. పట్టణంలో నాలుగు రోజులుగా కిన్నెరసాని తాగునీరు రాక ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు వారి భర్తలకు డబ్బులు సంపాదించుకోవడం మీద ఉన్న ధ్యాస ప్రజాసమస్యల పరిష్కారంలో లేదన్నారు. ఎమ్మెల్యే వనమా కొత్తగూడెం మున్సిపాలిటీకి రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందించలేకపోతున్నారని విమర్శించారు. తక్షణమే ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించి కిన్నెరసాని తాగునీటిని ప్రతిరోజూ సరఫరా చేయాలని లేదంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. గంధం మల్లికార్జున్‌రావు, సాయి, గుడివాడ రాజేందర్, పగవాల రుద్రయ్య, దేవతల నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో కూలి చెల్లించాలి



మాట్లాడుతున్న జాటోత్ కృష్ణ

ఇల్లెందురూరల్: మండుటెండల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు సకాలంలో కూలి చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని ప్రజాపంథా అనుబంధ ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ కృష్ణ అన్నారు. ఇల్లెందులో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేస్తున్న పాలకులు కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించడం లేదన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా కూలీలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి కూలీల సమస్యలు పరిష్కరించని పక్షంలో భవిష్యత్‌లో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయిని రాజు, రాము, పూనెం కుమార్, బొర్ర వెంకన్న, తెల్లం రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా సీసీ రోడ్డు



జూలూరుపాడు-వెంగన్నపాలెం గ్రామాల మధ్య గల పాలిమెర సీసీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నుంచి జూలూరుపాడు ఎస్సీ కాలనీ వరకు సుమారు కిలోమీటరు మేర రూ.64 లక్షల ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్డు నిర్మించి ఏడాది కావస్తున్నప్పటికీ సైడ్ బరమ్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సైకిల్, బైక్, ఆటో, ట్రాలీ, కారు వంటి వాహనాలు సీసీ రోడ్డుకు ఇరువైపుల ప్రమాదాలకు గురవుతున్నాయి. కాంట్రాక్టర్ సీసీ రోడ్డు నిర్మించి సైడ్ బరమ్స్ పోయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : నాగేందర్,
పీఆర్ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్: 9052565252